క్లుప్తంగా

'ఓటు మన జన్మహక్కు' చిత్రీకరణ





రామకృష్ణ

గార్ల: గార్లకు చెందిన కాంట్రాక్ట్ డ్రాయింగ్ టీచర్ ఎట్టి రామకృష్ణ బాదం చెట్టు ఆకుపై 'ఓటు మన జన్మ హక్కు' అని చిత్రీకరించాడు. గతంలో సైతం రామకృష్ణ చాక్‌పీస్‌లు, రావి, మోదుగు ఆకులపై పలు చిత్రాలను చిత్రీకరించి పలువురి మన్ననలను పొందాడు.

నిత్యావసరాల పంపిణీ

కురవి: మండలంలోని రాజోలు శివారు హరిదాసు తండాలో అనారోగ్యంతో బాధపడుతున్న ధరావత్ వీరన్న దంపతులు ఎలాంటి పనిచేయకుండా ఆర్థిక ఇబ్బందుల్లో ఉండగా విజయ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు మాలోత్ రామారావు ఆదివారం నిత్యావసర వస్తువులను అందజేశాడు. రూ.2,500 విలువైన బియ్యం, నూనెలు, కూరగాయలు ఉప్పు, పప్పులు అందజేశాడు. పేదలకు సేవలందించడం సంతోషంగా ఉందని రామారావు తెలిపాడు.

వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం



దంతాలపల్లి: మండలం పెద్దముప్పారం గ్రామంలో వెలసిన శ్రీదేవి, భూదేవి, సమేత స్వయంబు శ్రీవేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా వేదమూర్తులైన బ్రాహ్మణులు మాట్లాడుతూ.. కల్యాణంలో భాగంగా ఈనెల 10న విష్వక్షేన ఆరాధన, పుణ్యవచనం, రక్షబంధనం, అంకురార్పనం నిర్వహించామన్నారు. శనివారం సుదర్శన హోమం, పంచామృత అభిశేకం నిర్వహించి, ఆదివారం కల్యాణమహోత్సవం నిర్వహిచారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు వరదాచార్యులు, ధర్మకర్తలు నూకల వాసుదేవరెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన నాయకులు



మరిపెడ రూరల్: మరిపెడ మండలం భూక్య తండా గ్రామ పంచాయతీకి చెందిన 20కుటుంబాలు బీఆర్‌ఎస్ నాయకులు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మాలోతు బీకు ఆధ్వర్యంలో ప్రభుత విప్, డోర్నకల్ ఎమ్మెల్యే డాక్టర్ జాటోతు రాంచంద్రునాయక్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కాంగ్రెస్ పార్టీతోనే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. పార్టీలో చేరిన ప్రతీ కాంగ్రెస్ కార్యకర్తను కంటికి రెప్పాలా కాపాడుకుంటామని ఎమ్మెల్యే తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు ఆకర్షితులై ఇతర పార్టీల నుంచి భారీగా కాంగ్రెస్‌లో చేరుతున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో మాలోతు భిక్షపతి, మాలోతు తావుర్య, సక్కు, హాము, కల్యాణ్, మాలోతు సిరి, తదితరులు ఉన్నారు.

నూరు శాతం ఓటింగ్ జరగాలి

నర్సంపేట: పార్లమెంటు ఎన్నికల్లో నూరు శాతం ఓటింగ్ జరగాలని స్వచ్ఛంద సంస్థల సమాఖ్య అధ్యక్షుడు గిరగాని సుదర్శన్‌గౌడ్ ఆకాంక్షించారు. పట్టణంలోని ఆర్ అండ్ బీ గెస్ట్ హౌజ్ వద్ద ఆదివారం నిర్వహించిన ఓటరు చైతన్య కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అర్హులందరూ నిజాయితీగా ఓటు వేసి మంచి నాయకుడిని ఎన్నుకోవాలని సూచించారు. ప్రలోభాలకు లోను కావద్దని చెప్పారు. స్వయంకృషి స్వచ్ఛంద సంస్థ నిర్వాహకుడు బెజ్జంకి ప్రభాకర్ మాట్లాడుతూ.. ఓటు వేయడాన్ని సామాజిక బాధ్యతగా భావించాలని తెలిపారు. కార్యక్రమంలో స్వచ్ఛంద సంస్థల వలంటీర్ పంజాల రాజు, ఆటోడ్రైవర్లు, ప్రచాణికులు, తదితరులు పాల్గొన్నారు.

సార్వత్రిక ఎన్నికలకు సర్వం సిద్ధం

దోర్నకల్: మండలంలో సోమవారం జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలు సిద్ధమయ్యాయి. మండలంలోని 41 పోలింగ్ కేంద్రాల్లో 39,410 మంది ఓటు హక్కు వినియోగించుకోనుండగా వీరిలో 19,184 మంది పురుషులు, 20,213 మంది మహిళలు ఉన్నారు. డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలో 10పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. జెడ్పీహెచ్‌ఎస్‌లోని 160వ పోలింగ్ కేంద్రంతోపాటు ఎంపీపీఎస్‌లోని 163వ పోలింగ్ కేంద్రాలను మోడల్ పోలింగ్ కేంద్రాలుగా ముస్తాబు చేశారు. పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు అధికారులు ఏర్పాట్లు చేశారు.

గార్ల: గార్ల మండలంలో నేడు జరిగే లోక్‌సభ ఎన్నికలకు పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అసిస్టెంట్ ఎన్నికల అధికారి, తహసీల్దార్ రవీందర్ ఆదివారం వెల్లడించారు. మండలంలో 31పోలింగ్ కేంద్రాలు ఉండగా, 30,399 మంది ఓటర్లు నేడు ఓటుహక్కు వినియోగించుకోనున్నారు. పాలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం అన్ని సౌకర్యాలు కల్పించామని పేర్కొన్నారు. ఎన్నికల సిబ్బంది సామగ్రితో చేరుకున్నట్లు ఆయన తెలిపారు.

నెల్లికుదురు: మండలంలోని వివిధ గ్రామాలల్లో 45 పోలింగ్ కేంద్రాలల్లో పోలింగ్‌కు అంతా సిద్ధం చేసినట్లు అదనపు సహాయ రిటర్నింగ్ అధికారి రాజు తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. 45పోలింగ్ కేంద్రాలల్లో మొత్తం 180 మంది పోలింగ్, పోలీసు సిబ్బంది ఈవీఎంలు, పోలింగ్ సామగ్రితో విధుల్లో చేరినట్లు రిటర్నింగ్ అధికారి రాజు తెలిపారు.

దంతాలపల్లి: సార్వత్రిక ఎన్నికలకు ఏర్పాట్లను సర్వం సిద్ధం చేశామని తహసీల్దార్ శ్రీనివాస్‌రావు ఆదివారం తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా ఉన్న 30 పోలింగ్ కేంద్రాల్లో సిబ్బంది, ఓట్లు వేసే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలత్తెకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు.

మహబూబాబాద్ అర్బన్: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 496 ప్రభుత్వ పాఠశాలలో పోలింగ్ బూత్‌లు విద్యాశాఖ అధికారులు ఆదివారం ఏర్పాటు చేశారు.

కేసముద్రం: కేసముద్రం మండలంలోని 54 పోలింగ్ కేంద్రాలకు, ఇనుగుర్తి మండలంలోని 22 పోలింగ్ కేంద్రాలకు సంబంధిత అధికారులు, సిబ్బంది ఈవీఎం, పోలింగ్ సామగ్రితో చేరుకున్నారు. ఒక్కో పోలీంగ్‌స్టేషన్‌కు నలుగురు చొప్పున అధికారులు, సిబ్బందిని కేటాయించినట్లు అధికారులు తెలిపారు.

తొర్రూరు: తొర్రూరు పట్టణంతో పాటు 29 గ్రామాల్లో 57 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది. ఎన్నికల సిబ్బంది డీఆర్సీ కేంద్రాల్లో ఈవీఎంలు, వీవీ ప్యాట్లు, ఇతర సామగ్రి తీసుకుని పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. మండలంలో 65,497 మంది ఓటర్లు ఉండగా దానిలో 32,479 మంది పురుషులు, 33,013 మంది మహిళలు, ఐదుగురు ఇతరులు ఉన్నారు. వీరంతా నేడు ఓటు హక్కు వినియోగించుకోనున్నారు.

కురవి: పార్లమెంటు ఎన్నికల నిర్వహణలో భాగంగా కురవి, సీరోలు మండలాల్లోని అన్ని గ్రామాలకు ఎన్నికల సామగ్రి, అధికారులు, ఎన్నికల సిబ్బంది ఈవీఎంలను ఆదివారం ప్రత్యేక బస్సుల్లో పోలీసు బలగాల రక్షణ నడుమ తీసుకొచ్చారు. ఎన్నికల పోలింగ్ అధికారులు ఈవీఎం బాక్స్‌లను తీసుకుని కురవి జెడ్పీ హైస్కూల్ కేంద్రానికి వచ్చారు. పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు చేశారు. కురవిలోని ప్రాథమిక పాఠశాలలో మోడల్ మహిళా పోలింగ్ స్టేషన్‌లను అందంగా ముస్తాబు చేశారు.

పెద్దవంగర: పార్లమెంట్ ఎన్నికలకు మండలంలో ఏర్పాట్లు చేసినట్లు ఏఈఆర్‌ఓ తహసీల్దార్ మహేందర్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. మండలంలో 31 పోలింగ్ కేంద్రాలు ఉండగా మొత్తం 25,160 మంది ఓటర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నట్లు తెలిపారు. 31 పోలింగ్ కేంద్రాలకు గాను 3 రూట్లుగా విభజించి ప్రత్యేక అధికారులను నియమించినట్లు పేర్కొన్నారు. సోమవారం ఉదయం 5:30 నుంచి 7 గంటల వరకు మాక్ పోలింగ్ నిర్వహించనున్నారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు ఎన్నికలు జరుగనున్నాయి. పోలింగ్ శాతం పెంచేందుకు గంట అదనంగా పెంచామని ఓటర్ల తమ ఓటు హక్కును విధిగా వినియోగించుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పేర్కొన్నారు.

నర్సింహులపేట: పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా మండలంలోని వివిధ గ్రామాల్లో జరుగుతున్న పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లు పూర్తైనట్లు తహసీల్దార్ నాగరాజు తెలిపారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని 26 పోలింగ్ కేంద్రాలకు 24,459 ఓటర్లు ఉండగా ఇందులో పురుషులు 11,991, మహిళలు 12,466 , హోం ఓటర్స్ 138 మంది ఉన్నారు. ఎన్నికల సిబ్బంది 104 మందితో పాటుగా గ్రామాల్లో అంగన్‌వాడీ, ఆశాలు, సిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

కొత్తగూడ: మండలంలోని 38 పోలింగ్ కేంద్రాలకు ఎన్నికల సిబ్బంది, అధికారులు చేరుకున్నారు. అధికారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తగు ఏర్పాట్లను పంచాయతీ కార్యదర్శులు చేశారు.

చిన్నగూడూరు: మండల వ్యాప్తంగా 15 పోలింగ్ కేంద్రాలలో ఓటింగ్ జరగనుంది. ఓటింగ్ ప్రక్రియ ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరగనున్నట్లు మండల అధికారులు తెలిపారు.



గార్ల: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



పెద్దవంగర: బొమ్మకల్లు పోలింగ్ కేంద్రం వద్ద..



కురవి: పోలింగ్ కేంద్రానికి వెళ్తున్న సిబ్బంది



దోర్నకల్ ఎంపీపీఎస్‌లో మోడల్ పోలింగ్ కేంద్రం



కేసముద్రం: పోలింగ్ కేంద్రానికి సామగ్రితో చేరుకున్న సిబ్బంది



నెల్లికుదురు: పోలింగ్ కేంద్రానికి చేరుకున్న సిబ్బంది



దంతాలపల్లి: మండలంలోని ఆగపేట్ గ్రామంలో..



తొర్రూరు: ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో..

ఆర్టీసీ బస్సు, కారు ఢీ

ఖానాపురం: ఆర్టీసీ బస్సును కారు ఢీకొన్న ఘటన మండలంలోని అశోక్‌నగర్ శివారులో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని పాకాలకు కారులో వచ్చిన పర్యటకులు గిరకతాటి వనం వైపు నుంచి వస్తుండగా కొత్తగూడ నుంచి నర్సంపేటకు వస్తున్న ఆర్టీసీ బస్సును ఢీకొట్టింది. కారు వేగంగా బస్సు దిశగా దూసుకు వస్తుండటాన్ని గమనించిన ఆర్టీసీ డ్రైవర్ బస్సును నిలిపేసే ప్రయత్నం చేస్తుండగానే కారు ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో, బస్సులో ప్రయాణిస్తున్న పలువురికి స్వల్ప గాయాలయ్యాయి. ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

డీటీడీఓను సస్పెండ్ చేయాలి

నర్సంపేట: గిరిజన సంక్షేమ శాఖను మూడేళ్లుగా భ్రష్టు పట్టిస్తున్నారని హనుమకొండ, జనగామ డీటీడీఓ ప్రేమకళను సస్పెండ్ చేయాలని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తేజావత్ వాసు నాయక్ ప్రభుత్వాన్ని, జిల్లా ఉన్నతాధికారులను డిమాండ్ చేశారు. పట్టణంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన సంక్షేమ శాఖ హాస్టళ్లు, ఆశ్రమ పాఠశాలలు, పోస్టు మెట్రిక్ వసతి గృహాల్లో పని చేస్తున్న వార్డెన్లు, వర్కర్స్, కాంటిజెన్స్ ఉద్యోగులను అనేక రకాలుగా ఇబ్బంది పెట్టడంతోపాటు చిన్నపాటి తప్పులను సాకుగా చూపించి సస్పెండ్ చేసి తిరిగి లక్షలాది రూపాయలు దండుకుని ఉద్యోగంలో తీసుకుంటున్నారని తెలిపారు. ఒక్కో వార్డెన్‌కు రెండేసి స్థానాలు చొప్పున అప్పగిస్తూ డైట్ బిల్లుల నుంచి 20 శాతం చొప్పున డబ్బు వసూలు చేస్తూ అక్రమంగా కోట్లకు పడగలెత్తుతున్నాడని చెప్పారు. డీటీడీఓ ప్రేమకళ సంపాదించిన ఆస్తులపై ప్రభుత్వం, జిల్లా ఉన్నతాధికారి సమగ్ర విచారణ జరిపించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని, గిరిజన సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీని, కమిషనర్‌ను కలసి ఫిర్యాదు చేస్తామన్నారు. డీటీడీఓను సస్పెండ్ చేయకపోతే ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

వృద్ధురాలిపై కోతుల దాడి

ఖానాపురం: కోతులు దాడి చేయడంతో వృద్ధురాలికి గాయాలైన ఘటన మండలంలోని అశోక్‌నగర్‌లో ఆదివారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన వృద్ధురాలు లచ్చమ్మ తన ఇంటి ఎదుట చెట్టు కింద నిద్రిస్తుండగా కోతులు గుంపుగా వచ్చి ఆమెపై దాడి చేశాయి. దీంతో లచ్చమ్మ తప్పించుకునే ప్రయత్నం చేయగా కింద పడిపోయింది. ఆమె చేయి విరిగింది. తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు ఆమెను చికిత్స కోసం నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అమ్మప్రేమ వెలకట్టలేనిది



మహబూబాబాద్ అర్బన్: తల్లి కాళ్లు మొక్కుతున్న కుమారుడు రాములు



మహబూబాబాద్ రూరల్: మదర్స్ డే వేడుకల్లో పాల్గొన్న తల్లులు, పిల్లలు

మమబూబాబాద్ అర్బన్: మానుకోట జిల్లా కేంద్రంలోని హరిజనవాడలో దాసరి గురువమ్మ కుమారుడు దాసరి రాములు ఈశ్వరమ్మ దంపతులు, కుటుంబ సభ్యులు, కూతుళ్లు, మనవలు, మనమరాళ్ల ఆదివారం మాతృదినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కుమారుడు రాములు తల్లి కాళ్లు కడిగి, పాదాభివందనం చేసి కేక్ కట్ చేశారు. అనంతరం రాములు మాట్లాడుతూ.. ప్రపంచంలో వెలకట్టలేనిది అమ్మ ప్రేమ ఒకటేనన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ దాసరి అర్శికరావీష్, తదితరులు పాల్గొన్నారు. జిల్లాకేంద్రంలోని దళిత హిందూపరిషత్ ఆధ్వర్యంలో మాతృదినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో దళిత హిందూపరిత్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, మహిళలు కుక్కమూడి సాయిలమ్మ, సంధ్యారెడ్డి, సూరమ్మ పాల్గొన్నారు.



మహబూబాబాద్ అర్బన్: మాతృమూర్తులకు సన్మానం..

మహబూబాబాద్ రూరల్: మదర్స్ డే వేడుకలను జిల్లా కేంద్రంలోని బ్లెస్డ్ చర్చిలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. తల్లులు, పిల్లలు మదర్స్ డే కేక్ కట్ చేసి, స్టెల్లా మేరీ గ్రేస్ అమ్మగారిని శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

రామానుజాచార్యుల తిరునక్షత్రోత్సవం

మహబూబాబాద్ రూరల్: సమతామూర్తి భగవత్ రామానుజాచార్యుల వారి తిరునక్షత్రోత్సవ (జన్మ దినోత్సవం) 1,007వ వేడుకలను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని శ్రీవేణుగోపాలస్వామి వారి దేవాలయంలో ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. సాక్షాత్తు తిరుపతి వేంకటేశ్వర స్వామివారికి భగవత్ రామానుజాచార్యుల వారు శంఖుచక్రాలను సమర్పించారు. ఆలయ ప్రధాన అర్చకులు ముదుంబై లక్ష్మీనారాయణచార్యులు ఆధ్వర్యంలో సహ అర్చకులు భగవత్ రామానుజాచార్యుల ఉత్సవమూర్తిని భక్తుల సందర్శనార్థం ప్రత్యేక వేదికపై కొలువుదీర్చి అభిషేకం, అలంకరణ, అర్చన పూజలు జరిపారు. స్వామివారి జన్మనక్షత్రం ఆదిశేష అంశం సందర్భంగా సమతామూర్తి భగవత్ రామానుజాచార్యుల వారి తిరునక్షత్రోత్సవ పూజా వేడుకలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు, అర్చకులు పాల్గొన్నారు.



మహబూబాబాద్ రూరల్: పూజలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట: పట్టణంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో జగదాచార్య శ్రీరామానుజా తిరునక్షత్ర సందర్భంగా జగదాచార్య 1007వ జయంతిని వికాస తరంగిణి ఆధ్వర్యంలో ఆదివారం కనుల పండువగా నిర్వహించారు. ఈ సందర్భంగా వికాస తరంగిణి కోఆర్డినేటర్ దాస్యం రంగనాథస్వామి మాట్లాడారు. చెన్నయ్‌లోని శ్రీరంగంలో ఆలయ గోపురం 237 అడుగులు ఉండగా తెలంగాణలోని హైదరాబాద్ ముచ్చింతల్ శ్రీరామనగర్‌లో శ్రీరామానుజుల విగ్రహం 216 అడుగులోతు ఉందని చెప్పారు. భూలోక వైకుంతముగా భక్తులకు దర్శనమిస్తున్నారని తెలిపారు. తొలుత అర్చకులు ముదుంబై రామాచార్య విశ్వక్సేన, పుణ్యాధికాల అనంతరం భక్తుల చేత భాగవత్ రామానుజ అష్టోత్తర శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్రము, పారాయణం చేయించారు. వికాస తరంగిణి అధ్యక్షుడు కృష్ణారావు మాట్లాడుతూ.. శ్రీరామనగర్‌లోని ఆలయాన్ని ప్రజలందరూ దర్శించుకోవాలని సూచించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ ఎర్ర జగన్‌మోహన్‌రెడ్డి, వికాస తరంగిణి కార్యకర్తలు పాల్గొన్నారు.

నిద్రావస్థలో నిఘా నేత్రాలు

చిన్నగూడూరు: ప్రస్తుత సమాజంలో నేర నియంత్రణలో నిఘా నేత్రాలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. ఎక్కడ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరిగినా పోలీసులు సులభంగా ఛేదిస్తున్నారు. ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం. అటువంటి నిఘా నేత్రాలు పని చేయక నిఘా వ్యవస్థ అస్తవ్యస్తంగా మారింది. మండల కేంద్రంతోపాటు గ్రామాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పని చేయక అలంకార ప్రాయంగా దర్శనమిస్తున్నాయి. ప్రజాప్రతినిధులు, వ్యాపారస్తులు చందాలు వేసుకుని ఏర్పాటు చేసుకున్న సీసీ కెమెరాలు కొద్ది రోజులే పని చేసి అలంకారప్రాయంగా మారాయి.



మండల కేంద్రంలో పని చేయని సీసీ కెమెరా

అందుబాటులోకి తేవాలి

మండల కేంద్రంలోని ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల వైర్లు తెగి పని చేయక నేల చూపులు చూస్తున్నాయి. ఇదే అదునుగా భావించి ఇటీవలే మండల కేంద్రంలోని రామాలయంలో బావిలో మోటార్‌ను గుర్తు తెలియని వ్యక్తులు అర్ధ రాత్రి దొంగిలించారని స్థానికులు చెబుతున్నారు. నిఘా వ్యవస్థ మూలన పడడంతో దాతలు చేసిన సహకారమంతా వృథా అవుతుందని స్థానికులు తెలుపుతున్నారు. మండల అధికారులు, పోలీసులు స్పందించి సీసీ కెమెరాలు మరమ్మతులు చేయించి అందుబాటులోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

మరమ్మతులు చేయాలి



మండలంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలకు మరమ్మతులు చేయించాలి. మండల కేంద్రంలో ప్రధాన షాపులు ఉన్నాయి. రాత్రి వేళల్లో నిఘా వ్యవస్థను పెంచి నేర నియంత్రణను అరికట్టాలి.

– గాదెపెల్లి జీవన్, చిన్నగూడూరు

నేర నియంత్రణలో ముఖ్యపాత్ర



సీసీ కెమెరాలు పని చేసే విధంగా చూడాలి. గ్రామాల్లో రాత్రి సమయంలో నిర్మానుష్యంగా ఉంటుంది. సీసీ కెమెరాలు నేర నియంత్రణకు ముఖ్య పాత్ర పోషిస్తాయి. అలాంటి సీసీ కెమెరాలను నామమాత్రానికి పెట్టి వదిలేశారు.

– పసునాది విజయ్, చిన్నగూడూరు

దుర్గమ్మకు బోనాల సమర్పణ



బోనాలతో వెళ్తున్న మహిళలు

కేసముద్రం: మండల కేంద్రంలోని బ్రహ్మంగారితండాలో దుర్గమ్మ దేవాలయాన్ని నూతనంగా నిర్మిస్తున్నారు. ఈ మేరకు ఆదివారం మహిళలు నీళ్ల బోనాలను అమ్మవారికి సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం జలాభిషేకం చేశారు. గ్రామంలో సందడి వాతావరణం నెలకొంది. కార్యక్రమంలో దేవాలయ కమిటీ సభ్యులు, తండా పెద్దలు పాల్గొన్నారు.

హమాలీలకు టవల్స్ పంపిణీ

దుగ్గొండి: ఎండల తీవ్రత నేపథ్యంలో మండలంలోని నాచినపల్లిలో హమాలీ కార్మికులకు మాజీ సర్పంచ్ పెండ్యాల మమత భర్త రాజు ఆదివారం ఉచితంగా టవల్స్ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఎండలు దంచి కొడుతున్న ప్రస్తుత తరుణంలో వరిధాన్యం, మొక్కజొన్న పంటలు చేతికొచ్చాయని చెప్పారు. ఈ క్రమంలో రైతన్నలు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారని తెలిపారు. వేసవి ఎండల నుంచి రక్షించుకునేలా హమాలీలకు ఉచిత చేనేత టవల్స్ అందజేసినట్టు వివరించారు. కార్మికులు మధ్యాహ్న వేళల్లో విరామం తీసుకోవాలని, ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. కార్యక్రమంలో హమాలీలు స్వామి, రాజు, ఖాజీయాదవ్ పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో దుక్కిటెద్దు మృతి

పాలకుర్తి: మండలంలోని గూడూరు గ్రామానికి చెందిన కుంట నర్సయ్యకు చెందిన దుక్కిటెద్దు పొలంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌కు తగిలి షాక్‌తో అక్కడికక్కడే ఆదివారం మృతి చెందింది. మృతి చెందిన ఎద్దు విలువ రూ.50 వేలు ఉంటుందని బాధితుడు తెలిపాడు. ప్రభుత్వం సహాయం అందించి ఆదుకోవాలని ఆయన కోరాడు.

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం

గీసుకొండ: మండలంలోని మనుగొండకు చెందిన చాపర్తి యశ్వంత్, పేర్ల లింగయ్య ఇటీవల మృతి చెందగా బాధిత కుటుంబాలకు కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకుడు, సామాజిక సేవకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి ఆదివారం రూ.5వేల చొప్పున సాయం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అల్లం మర్రెడ్డి, కొమ్ము శ్రీకాంత్, కందికొండ రాజు, బొందాలు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
మహబూబాబాద్ : 9010144453
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా, లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎస్.కె. అన్వర్ పాషా, (S.R) : 7997958185
వి. సతీష్ (S.R) (దోర్నకల్) : 9640394736
ఎం. మురళి, (S.R) (తొర్రూరు) : 7680822646